క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీతారామపురం సబ్ స్టేషన్, 11కేవీ మారుతీనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి. రవీంద్రబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మారుతీ నగర్ కాలువగట్టు, చుట్టుగుంట కాలువగట్టు, సిమెంట్ రోడ్డు, కాకాని నగర్, బీఎస్ఎన్ఎల్ భవన్, కాకర్ల వారి వీధి, వీరయ్య వీధి, మాగంటి వారి వీధి, మసీదు వీధి, గద్దే పూర్ణచంద్రరావు వీధి, ప్రకాశరావు వీధి, అనుమోలు శేషగిరిరావు వీధి, గోగినేని వారి వీధి, మిల్క్ బూత్ స్ట్రీట్, పటేల్ రోడ్డు, ఎస్ఆర్ఆర్ కళాశాల వెనుక తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

నేడు న్యాయవాదులకు ఉచిత వైద్య శిబిరం

విజయవాడలీగల్: న్యాయవాదులకు శుక్రవారం బెజవాడ బార్ అసోసియేషన్ హాలులో ఉచిత గుండె పరీక్షలు, కిడ్నీ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు ఏకే బాషా ఓ ప్రకటనలో తెలిపారు. 40 సంవత్సరాలు దాటిన న్యాయవాదులు బీబీఏలో ముందుగా రిజిస్టర్ చేయించుకొన్న వందమంది న్యాయవాదులకు మాత్రమే నగరంలోని ప్రముఖ ఆసుప్రతి వైద్యులచేత పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. అలాగే ఉచిత వైద్య సలహాలు కూడా ఇస్తారని తెలిపారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీహరి



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): భారతీయ జనతా పార్టీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణపురానికి చెందిన కె.శ్రీహరిని నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దల నమ్మకాన్ని నిలబెట్టుకుని సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అందరికీ అందేటట్లు చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్, రాష్ట్ర క్లస్టర్ ఇన్‌చార్జ్ శ్రీనివాస రాజు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్‌కి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

వదంతులను నమ్మవద్దు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బుడమేరుకు మళ్లీ వరద వస్తుందని కొంతమంది చేస్తున్న అసత్య ప్రచారాలు, వదంతులను నమ్మవద్దని కొత్తపేట సీఐ చిన్న కొండలరావు వైఎస్సార్ కాలనీ వాసులకు సూచించారు. గురువారం రాత్రి కాలనీలోని పలు ప్రాంతాల్లో పోలీసులు మైక్ ప్రచారం నిర్వహించారు. కాలనీకి మళ్లీ వరద వస్తుందంటూ ఉదయం నుంచి కొంత మంది పుకార్లు సృష్టించడంతో ఆయన కాలనీలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పోలీస్ వాహనానికి మైక్ ఏర్పాటు చేసి కాలనీలోని ప్రతి బ్లాక్‌లోని ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించారు. గురువారం సాయంత్రమే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడామని, బుడమేరులో వరద నీరు ప్రస్తుతం గ్రౌండ్ లెవల్‌లోనే ఉందని వారు చెప్పారని వివరించారు. ఎటువంటి ప్రమాదం ఉన్నా ముందుగా ప్రజలకు ప్రభుత్వ శాఖల ద్వారానే తెలియజేస్తామని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): అప్పుల బాధతో విషం తాగి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి గురువారం మృతి చెందినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. సుందరయ్యనగర్లో కూల్ డ్రింక్స్‌షాపు నడుపుతున్న రవిపాటి శివ(36) గతేడాది వచ్చిన వరదల కారణంగా వ్యాపారం లేక, ఇల్లుకొనేందుకు బ్యాంక్ నుంచి తీసుకున్న అప్పు తీర్చలేక ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురైన శివ ఈ నెల 20వ తేదీన విషం తీసుకున్నాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ 24వ తేదీన మృతి చెందినట్లు మృతుని భార్య రవిపాటి సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

27న సృష్టికర్త శతకం ఆవిష్కరణ

విజయవాడ కల్చరల్: రమ్యభారతి సాహిత్యవేదిక ఆధ్వర్యంలో 27వ తేదీ ఆదివారం తుమ్మోజు లక్ష్మణాచార్యులు రచించిన సృష్టికర్త శతకం ఆవిష్కరణ సభను నిర్వహిస్తున్నట్లు రమ్యభారతి కార్యదర్శి చలపాక ప్రకాష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బందరురోడ్డులోని రామ్మోహన గ్రంథాలయ ప్రాంగణంలోని అటల్ బిహారీ వాజ్‌పేయి సమావేశ మందిరంలో ఆవిష్కరణ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాహితీవేత్తలు డాక్టర్ జీవీ పూర్ణచందు, గబ్బిట దుర్గాప్రసాద్, గుమ్మా సాంబశివరావు పాల్గొంటారని తెలిపారు.



జీవీఆర్‌నగర్‌లో తవ్వి వదిలేయడంతో బురదగా మారిన రోడ్డు



దావు బుచ్చయ్యకాలనీలో చెరువును తలపిస్తున్న ఖాళీ స్థలం

చినుకు పడితే చిత్తడే

- మురుగునీరు పోయే దారి లేక ఇబ్బందులు
- రోడ్లు, ఖాళీ స్థలాల్లో నిలిచిపోతున్న వర్షం నీరు
- అవస్థలు పడుతున్న శివారు ప్రాంత వాసులు



జీవీఆర్ నగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వేగంగా అభివృద్ధి చెందుతున్న నగర శివారు ప్రాంతాలలో మురుగుకాలువలు సక్రమంగా లేవు. దీంతో ఇంట్లో వాడిన మురుగు బయటకు పోయే మార్గం లేదు. ఇక వర్షపు నీరైతే రోడ్లపై నిలిచిపోవడమే. దీంతో స్థానికులు ఆయా ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లోకి నీటిని మళ్లిస్తున్నారు. ఫలితంగా అక్కడ ఖాళీస్థలాలు మురుగు, వర్షపునీటితో నిండిపోయి చెరువులను తలపిస్తున్నాయి. చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయి విషసర్పాలు, క్రిమికీటకాలకు ఆవాస కేంద్రంగా మారుతున్నాయి.

మురుగు పోయే దారేది?

స్థానిక జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్, దేవీనగర్, సాయినగర్ తదితర ప్రాంతాల్లో సైడు కాలువలు నిర్మించి మురుగు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పుడు ఉన్న అరకొర మురుగుకాలువలతో సమస్యలు తీరటం లేదని వివరిస్తున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆయా ప్రాంతాలు చిత్తడిగా మారాయి. అలాగే వర్షపునీరు ఖాళీస్థలాల్లో నిలిచిపోయి దోమలు, విషసర్పాలకు నిలయంగా ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రోడ్లపైనే వర్షపునీరు..

ఈ ప్రాంతాలలో వర్షపునీరు బయటకు పోయే మార్గం లేకపోవటం వల్ల రోడ్లపైనే చేరిపోతున్నాయి. దీంతో జీవీఆర్‌నగర్ జీరో లైన్ క్రాస్ రోడ్లు, దావు బుచ్చయ్యకాలనీ డొంక రోడ్డు క్రాస్ రోడ్లు, వినాయకనగర్, సాయినగర్ తదితర ప్రాంతాలలో వర్షపునీరు రోడ్డుపై నిలిచిపోవటంతో రాకపోకలకు వాహన చోదకులు పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షపు నీరు నిలిచిపోవటం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారటంతో పాటు క్రిమికీటకాలు పెరిగిపోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. విషసర్పాలు ఇప్పటికే పలుమార్లు ఇళ్లలోకి ప్రవేశించాయని దీనివల్ల తమకు రక్షణ కరువయ్యిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నత్తనడకన వాటర్‌వర్క్స్, యూజీడీ పనులు..

ఇక్కడ జరుగుతున్న వాటర్ వర్క్స్, యూజీడీ పనులు స్థానికుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. వాటర్ వర్క్స్, యూజీడీ పనులలో భాగంగా రోడ్లు తవ్వి పనులు చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా... తవ్విన రోడ్లను తిరిగి సరిచేయకపోవటం వల్ల ఇబ్బందులు తలెత్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాలువలను సరిచేయడంతో పాటు రోడ్లపై వర్షపు నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దేశంలోనే ఉత్తమ మరుగుదొడ్లుగా తీర్చిదిద్దాలి

మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని మరుగుదొడ్లను దేశంలోనే ఉత్తమంగా తీర్చిదిద్దాలని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం వాటర్ ట్యాంక్ రోడ్డు, సాంబమూర్తి రోడ్డు, గవర్నర్ పేట, సీకే రెడ్డి రోడ్డు, అజిత్ సింగ్ నగర్ ఎక్సెల్ ప్లాంట్ ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న 70 మరుగుదొడ్లకు మరమ్మతులు చేసి, ప్రజల అవసరాలకు తగిన విధంగా తీర్చిదిద్దాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులందరూ నగరంలోని ప్రతి రోడ్డులో పర్యటించి ఎక్కడైనా గుంతలు ఏర్పడితే ఎప్పటికప్పుడు పూడ్చాలని సూచించారు.

రోడ్లు శుభ్రంగా ఉండాలి..

నగరంలోని రోడ్లు అన్నింటిని పరిశుభ్రంగా ఉంచాలని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. సాంబమూర్తి రోడ్డులో ప్రమాదంగా ఉన్న గ్రేటింగ్‌ను గమనించి, తక్షణం మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డివైడర్ నుంచి ఫుట్‌పాత్ సహా రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. రోడ్లపై పాత సామగ్రి, కార్లను ఉంచకుండా చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందికి సూచించారు. వంతెనలపై ఏర్పాటు చేసిన మెస్‌లపై పిచ్చి మొక్కలు మొలవకుండా ప్రజారోగ్యం, ఉద్యాన శాఖలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. నగరంలో ఉన్న మార్కెట్లు, రైతు బజార్లలో నుంచి వచ్చే వ్యర్థాలకు సంబంధించి చీఫ్ సిటీ ప్లానర్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్, ఎస్టేట్ ఆఫీసర్లు సమన్వయంతో సంపూర్ణ నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా దోమలు ప్రబలకుండా మలేరియా సిబ్బంది, యాంటీ మలేరియల్ ఆక్టివిటీస్ నిర్వహించాలని చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్‌కు సూచించారు. ఇంటింటి నుంచి వ్యర్థాలు సేకరిస్తున్న విధంగానే, యాంటీ లార్వే పనులు జరగాలని స్పష్టంచేశారు. అనంతరం అజిత్ సింగ్‌నగర్‌లోని గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్‌ను పరిశీలించారు. చెత్త తరలింపునకు మరికొన్ని వాహనాలు ఏర్పాటుచేసి, పేరుకుపోయిన వ్యర్థాలను జిందాల్‌కు పంపించాలని ఆదేశించారు.

కార్మిక, ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడాలి

వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు గౌతంరెడ్డి




సుంకర నారాయణను సత్కరిస్తున్న గౌతంరెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని కార్మికులు, ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం పాటుపడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతం రెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ స్టేట్ జనరల్ సెక్రటరీగా ఇటీవల నియమితులైన విద్యాధరపురానికి చెందిన సుంకర నారాయణ గురువారం సత్యనారాయణపురంలోని గౌతంరెడ్డి కార్యాలయానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన సుంకర నారాయణను అభినందిస్తూ సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్మికుల పక్షపాతిగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన పాలనలో వాహనమిత్ర పథకం ద్వారా ఆటో కార్మికులకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారని గుర్తు చేశారు. ఆప్కాస్ విధానాన్ని ప్రవేశపెట్టి వేలాది కార్మికులు, ఉద్యోగులను అందులోకి తీసుకువచ్చిన ఘనత వైఎస్ జగన్‌దేనన్నారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటుందని, మునిసిపల్ వర్కర్లు, ఆశా వర్కర్లు తదితర విభాగాల కార్మికులు, ఉద్యోగులు రోడ్డెక్కి నిరసన కార్యక్రమాలు నిర్వహించడమే అందుకు నిదర్శనమని అన్నారు. సుంకర నారాయణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధి, అంకిత భావంతో నిర్వర్తిస్తానని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు సరగడ శంకర రెడ్డి, బోర మల్లి రెడ్డి, గుండు శ్రీను, దుర్గారెడ్డి, బి. వెంకటేశ్వరరావు, కె. భాస్కరరావు ఉన్నారు.

పాఠ్యాంశాలు మార్చినంత మాత్రాన చరిత్ర మారదు

ప్రముఖ జీవ శాస్త్రవేత్త డాక్టర్ దేవరాజు మహారాజు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ దేవరాజు మహారాజు

కృష్ణలంక(విజయవాడతూర్పు): హిందూ జాతీయవాదానికి అనుగుణంగా పాఠశాలల్లో పాఠ్యాంశాలను మార్చేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ప్రముఖ జీవశాస్త్రవేత్త, కవిరాజు త్రిపురనేని జాతీయ పురస్కార తొలి గ్రహీత డాక్టర్ దేవరాజు మహారాజు అన్నారు. పాఠ్యాంశాలను మార్చినంత మాత్రాన సైన్సు, చరిత్ర మారవన్నారు. గవర్నర్ పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రముఖ విద్యావేత్త ఎస్.ఆర్.పరిమి అధ్యక్షతన 'సైన్స్, చరిత్ర పాఠ్యాంశాల్లో మార్పులు' అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి దేవరాజు మహారాజు మాట్లాడుతూ.. సమాజ గతిని మార్చగల శక్తి సామర్థ్యాలు సమాజంలో ఎప్పుడైనా ఏ కొద్ది మందికో ఉంటాయన్నారు. ఆ కొద్ది మంది తయారు కావడానికి ప్రభుత్వాలు అవకాశాలు కల్పించాలన్నారు. పాఠ్య పుస్తకాల్లో అవసరమైన అంశాలు తొలగించడమంటే నిజాలను తొక్కిపెట్టడం, సమాజాన్ని నిస్సత్తువగా మార్చడమేనని అభిప్రాయం వ్యక్తంచేశారు. నిజాల్ని దాచిపెట్టి హిందుత్వ అజెండాను తీసుకొచ్చి సృష్టి సిద్ధాంతాన్ని బాలబాలికల మెదళ్లలో కూర్చి, రాజ్యాంగాన్ని పక్కకు తోసి మనుస్మృతిని వాడుకలోకి తేవాలన్నదే ఆర్ఎస్ఎస్, బీజేపీ ఉద్దేశమన్నారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం పాఠశాల పాఠ్యగ్రంథాల నుంచి సైన్సు, చరిత్రకు సంబంధించి పలు అంశాలను తొలగించిందన్నారు. నిజానికి అవి చాలా ముఖ్యమైన అంశాలన్నారు. జీవ పరిణామాన్ని విజ్ఞాన శాస్త్ర సిలబస్‌లో లేకుండా చేయడం అన్యాయమన్నారు. చరిత్ర పాఠ్య పుస్తకాల నుంచి 400 సంవత్సరాలు పరిపాలన చేసిన మొఘలుల పాలనా కాలాన్ని తొలగించడం, వారి విద్వేష పాలసీ విధానానికి అనుగుణంగా చేసిందేనని పేర్కొన్నారు. పాఠ్యగ్రంథాల సిలబస్‌లు మార్చుకున్నంత మాత్రాన అసలు చరిత్ర మారదు కదా, చారిత్రక ఆనవాళ్లు తుడిచి పెట్టుకుపోవు కదా అని ప్రశ్నించారు. ఆర్కియాలజీ విభాగం రిపోర్టులు, ప్రపంచ వ్యాప్తంగా వందల మంది చరిత్రకారులు రాసిన చరిత్ర గ్రంథాలు మాట్లాడుతూనే ఉంటాయన్నారు. ఈ సదస్సులో ఎంబీ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పి.మురళీకృష్ణ, పరిమి మేడసాని సుభాకర్ తదితరులు మాట్లాడారు.

మేయర్, కమిషనర్‌కు సత్కారం



భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ ద్వారా నగరానికి ప్రతిష్టాత్మకమైన అవార్డుల సాధనకు కృషి చేసిన మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ ధ్యాన్‌చంద్రను సత్కరించారు. పర్యావరణ సేవా సంస్థ 'వన్ ఎర్త్ – వన్ లైఫ్' ప్రతినిధులు గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని వారి వారి చాంబర్‌లకు వెళ్లి మేయర్, కమిషనర్‌ను అభినందించి దుశ్శాలువాతో సత్కరించారు. స్వచ్ఛత విషయంలో అధికారులు, కార్మికులు, ఉద్యోగుల సమష్టి కృషితో స్వచ్ఛత సూపర్‌లీగ్ సిటీ, గ్రార్బేజ్ ఫ్రీ సిటీ అవార్డులను దక్కించుకుని విజయవాడ నగరాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారని కొనియాడారు. ప్రజల భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణకు తమ సంస్థ కృషి చేస్తుందని మేయర్, కమిషనర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో 'వన్ ఎర్త్ – వన్ లైఫ్' గ్రూప్ అడ్మిన్లు లీలాకుమారి ఏలూరి, అరికెపూడి సురేష్, కో అడ్మిన్లు నాగలక్ష్మి, పాలడుగు సురేష్, మద్దిరాల కమలాకరరావు, వీర వనిత, కృష్ణవేణి, సరిత, హారతి పాల్గొన్నారు.

30న హుండీ కానుకల లెక్కింపు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట చల్లపల్లి బంగ్లా సమీపంలో వేంచేసియున్న శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానం హుండీల్లోని కానుకలను ఈనెల 30వ తేదీ ఉదయం 10గంటలకు లెక్కించనున్నట్లు ఆలయ ఈవో యడర్లపల్లి సీతారామయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవదాయ, ధర్మదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో, ఆలయవంశ పారంపర్య ధర్మకర్తలు, రెవెన్యూ, పోలీస్ శాఖ, హిందూ సేవాదళ్ సభ్యులు పెద్దలు, భక్తుల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కిస్తారన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు కానుకల లెక్కింపులో పాల్గొనవచ్చని తెలిపారు.

పద్యనాటకానికి పూర్వవైభవం తేవాలి



మోహినీ విజయం నాటకంలోని ఓ సన్నివేశం

విజయవాడ కల్చరల్: పద్యనాటకం తెలుగు వారి ఆత్మ అని రంగస్థల ప్రముఖుడు అగురు త్రినాథనాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సమితి సహకారంతో సాయి హృదయా కళానాట్యమండలి గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో గురువారం మోహినీ విజయం పద్యనాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమాలను ప్రారంభించిన త్రినాథనాయుడు మాట్లాడుతూ పద్యనాటకానికి పూర్వవైభవం తీసుకురావాలన్నారు. రంగస్థల కళాకారుడు కొమ్మినేని సాంబశివరావు మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించాలని సూచించారు. గుమ్మడి జయరాజు కళాపీఠం కోశాధికారి జి. జీవన్‌కుమార్, మోడీ సూర్యనారాయణ పాల్గొన్నారు. కళాకారుడు కపిలేశ్వరపు పైడేశ్వరరావును నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. రంగస్థల నటులు మోహినీ విజయం పద్యనాటకాన్ని హృద్యంగా ప్రదర్శించారు. భస్మాసురునిగా అగురు త్రినాథనాయుడు, విష్ణుమూర్తిగా కేవీ రమణారావు, శంకరునిగా దుర్గారావు మాస్టారు, లక్ష్మీదేవిగా దుర్గ, మోహినిగా లక్ష్మీశ్రీ, నటించారు.

ఘనంగా అయ్యంకి జయంతి వేడుకలు



అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది



చదరంగం పోటీల్లో విజేతలతో అతిథులు, నిర్వాహకులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య 135వ జయంతి వేడుకలను స్థానిక సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్ పాఠకులతో కలసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక విలువ తెలిసిన అయ్యంకి వెంకట రమణయ్య గ్రంథాలయ ఉద్యమాలతో తెలుగునాట గ్రంథాలయాల ఏర్పాటుకు కారకులయ్యారని కొనియాడారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పుస్తక హుండీ దాతల ద్వారా లభ్యమైన పుస్తకాలతో పుస్తక ప్రదర్శన నిర్వహించి, గ్రంథాలయానికి విచ్చేసిన పాఠకులకు వారు కోరిన పుస్తకాలను ఉచితంగా అందజేశారు. అనంతరం పాఠకులకు స్వీట్స్ పంపిణీ చేశారు. గ్రేడ్–3 గ్రంథాలయ అధికారి కె.వి.ఎస్ ప్రసాద్, రికార్డ్ అసిస్టెంట్ కె.ప్రణీత, సిబ్బంది డి. మానస, పార్వతమ్మ, పాఠకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఠాగూర్ గ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణయ్య జయంతి సందర్భంగా సరస్వతి సామ్రాజ్యం ట్రస్ట్, కృష్ణాజిల్లా గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను రాష్ట్ర పౌర గ్రంథాలయ డైరెక్టర్ ఏ కృష్ణమోహన్ ప్రారంభించారు. మొత్తం 160 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. చదరంగం పోటీల్లో కొల్లా భావన్ మొదటి స్థానంలో నిలిచారు. కొల్లా భావన్ 7 పాయింట్లతో ప్రథమ స్థానంలో సీహెచ్ మాధవ 6 పాయింట్లతో ద్వితీయ స్థానం, వేదాంతు తృతీయ స్థానంలో నిలిచారు. గ్రంథాలయాధికారి కె. రమాదేవి విజేతలకు సర్టిఫికెట్లు, ట్రోఫీలు అందజేశారు. ఈ పోటీలకు జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి మందుల రాజీవ్ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. పోటీలలో పాల్గొన్న చిన్నారులను ఉత్తేజపరిచేందుకు అండర్ 8, 10, 12, 14 క్యాటగిరీలలో మొదటి పది స్థానాల్లో నిలిచిన వారికి కూడా ట్రోఫీలు, మెడల్, సర్టిఫికెట్లతో సత్కరించారు.

మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలి

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సర్ ఆర్థర్ కాటన్, గుర్రం జాషువా చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నేటి యువత మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రభ కాలనీ జనహిత సదనంలో గురువారం సాయంత్రం గోదావరి, కృష్ణా డెల్టాల రూపకర్త సర్ ఆర్థర్ కాటన్, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా డెల్టా రూపకర్త సర్ ఆర్థర్ కాటన్ రైతులపాలిట అపర భగీరథుడని కొనియాడారు. కవిత్వమే ఆయుధంగా మూఢాచారాలపై తిరగబడిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని అన్నారు. తెలుగు సాహితీ లోకంలో ఆయన దిగ్గజ వ్యక్తిగా నిలిచిపోతారన్నారు. ఆ మహనీయుల స్ఫూర్తితో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శర్వాణీ మూర్తి, యర్లగొర్ల శ్రీరాములు, ఈసరపు రాజ రమేష్, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రవి చంద్ర, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరం త్రివేణి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ రాణి, సెంట్రల్ నియోజకవర్గం మహిళ అధ్యక్షురాలు తోపుల వరలక్ష్మి, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి ఆచారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మలేరియా ఉద్యోగి అదృశ్యంపై ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ మలేరియా సెక్షన్‌లో అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్‌గా పని చేస్తున్న ధారావత్ రవిచంద్ర సూర్యకుమార్(48) అదృశ్యంపై అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ధారావత్ రవిచంద్ర సూర్యకుమార్, సుబ్బలక్ష్మి దంపతులు కుటుంబసభ్యులతో కలిసి అజిత్‌సింగ్ నగర్ ఇందిరానాయక్ నగర్‌లో నివసిస్తున్నారు. ఈ క్రమంలో రవిచంద్ర సూర్యకుమార్ బుధవారం సాయంత్రం 4.30 గంట ల సమయంలో ఆఫీస్‌కు వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి 7 గంటలు అయినా ఇంటికి రాకపోవడంతో భార్య ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. గురువారం కూడా ఇంటికి చేరుకోకపోవడంతో భార్య సుబ్బలక్ష్మి బందరు రోడ్‌లోని జిల్లా మలేరియా ఆఫీస్‌కు వెళ్లి విచారించగా రవిచంద్ర సూర్యకుమార్ బుధవారం సాయంత్రం ఆఫీస్‌కే రాలేదని తెలిపారు. దాంతో ఆమె బంధువుల ఇళ్లల్లో, రైల్వే స్టేషన్, బస్టాండ్, ఇతర ముఖ్యమైన ప్రదేశాల్లో వెతికింది. అయినా అతని ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాయకపురంలో వివాహిత అదృశ్యం..

పాయకాపురం(విజయవాడరూరల్): పాతపాడు గ్రామంలో వేరుశనగ కంపెనీలో పనికి వెళ్లిన తన కుమార్తె తిరిగి రాలేదని తల్లి ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు నున్న గ్రామానికి చెందిన బేతపూడి మేరి కుమార్తె మౌనిక భర్తతో విడిపోయి ఐదేళ్లుగా పుట్టింట్లో ఉంటోంది. గత కొంత కాలంగా సురేష్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం కలిగి ఉంది. ఇది తెలిసిన తల్లి మందలించింది. కాగా మౌనిక ఈ నెల 23వ తేదీన పాతపాడులో వేరుశనగ కంపెనీలో పనికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని తల్లి మేరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నటుడు కోట మృతి తీరని లోటు



కోట సంస్మరణ సభలో పాల్గొన్న కళాకారులు, అతిథులు

విజయవాడ కల్చరల్: సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతి సినీ రంగానికి తీరని లోటు అని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. పద్మశ్రీ ఘంటసాల చైతన్యవేదిక, శ్రీకళాభారతి, తెలుగు కళావాహిని ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై గురువారం సినీ సంగీత విభావరి, కోటశ్రీనివాసరావు సంస్మరణ సభ నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న నటుడు కోట అని అభివర్ణించారు. కోట వెంకటేశ్వరెడ్డి మాట్లాడుతూ బహు భాషా నటి బి. సరోజ అన్నారు. ఆకాశవాణి విశ్రాంత అనౌన్సర్ మాడుగుల రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం కోట శ్రీనివాసరావు పేరుతో పురస్కారాలను ప్రదానం చేయాలన్నారు. కార్యక్రమంలో కె. డేవిడ్‌రాజు, బి. వీరభద్రరావు, గోళ్ల నారాయణ రావు, శింగంశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. గాయనీ గాయకులు రాజు, కొండేటి దుర్గానాగమణి, మల్లాది స్వాతి, నాగమణి, చిత్రగీతాలను ఆలపించగా.. వారిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.